క్లుప్తంగా

ఘనంగా రథోత్సవం



లింగంధనలో రథాన్ని లాగుతున్న భక్తులు

కేశంపేట: మండల పరిధిలోని లింగంధన, తొమ్మిదిరేకుల గ్రామాల్లో భక్తులు, గ్రామస్తులు ఘనంగా రథోత్సవం నిర్వహించారు. సీతారాముల కల్యాణం అనంతరం మరుసటి రోజు ఆయా గ్రామాల్లో ఉదయం రథోత్సవం, సాయంత్రం బండ్ల తిరుగుట కార్యక్రమాలను నిర్వహిస్తారు. అందులో భాగంగా సోమవారం భక్తులు ఆయా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, సుదర్శన్‌గుప్తా, లక్ష్మీనర్సింహారెడ్డి, రవీందర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శివ మారుతీ గీత అయ్యప్ప మందిరంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

షాద్‌నగర్: అన్నదానం మహాదానం అని ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి రేటికల్ నందీశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని శివ మారుతీ గీత అయ్యప్ప మందిరంలో కల్పవృక్ష ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నందీశ్వర్ ప్రారంభించి మాట్లాడుతూ.. దేవాలయంలో ప్రతీ సోమవారం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ దాన గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మల్లికార్జున్, దేవదాస్, సుమంత్, మల్లేశ్, రాజు, ఆలయ మేనేజర్ రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

సీఐ భూపాల్‌శ్రీధర్




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ భూపాల్‌శ్రీధర్, స్థానిక నాయకులు

చేవెళ్ల: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ఏర్పాటు చేసే చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. పట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో దాత సీనియర్ ఎల్ఐసీ ఏజెంట్ కిచ్చన్నగారి వెంకట్‌రెడ్డి నేస్తం ఇన్సూరెన్స్ సర్వీసెస్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మానిక్యం, వెంకటయ్య, కమాల్‌రెడ్డి, నర్సింలు తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తా వద్ద విజయ్‌రాజ్ ఠాగూర్ గార్డెన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ నర్సింలు, విజయ్‌రాజ్ ఠాగూర్ గార్డెన్ యజమాని సతీశ్ తదితరులు ఉన్నారు.

మొయినాబాద్ మండల విద్యాధికారిగా మల్లయ్య



మల్లయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్ఎంలు

మొయినాబాద్: మండల పరిధిలోని వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఎన్ఓ మల్లయ్య మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మండల విద్యాధికారిగా పనిచేసిన వెంకటయ్య మార్చి 31న ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో మల్లయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం మల్లయ్య మండల వనరుల కేంద్రంలో విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మల్లయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, ప్రధానోపాధ్యాయులు నర్సింలు, లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, రాములు, ఎస్‌టీఎఫ్ మండల అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యాయుడు రాంచందర్, సిబ్బంది మహేందర్, గోపాల్, అన్నపూర్ణ, శ్రీలత తదితరులు ఉన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది



మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- కేశంపేట పీహెచ్‌సీని వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇద్దరు వైద్యుల్లో ఒకరు అనాధికారిక సెలవులో..
- రోగులకు తప్పని అవస్థలు

కేశంపేట: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ అందులో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఉన్న వైద్యులు రోగులకు అందుబాటులో ఉండకపోవడంతో ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. ఇది కేశంపేట పీహెచ్‌సీ దుస్థితి.

తగ్గుతున్న రోగుల సంఖ్య..

మండలంలో 29 గ్రామాల పరిధిలో సుమారుగా 48వేల జనాభా ఉంటుంది. వీరందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసింది. ఈ ఆస్పత్రికి గతంలో మంచి పేరుండేది. అక్కడ వైద్యం కోసం మండల ప్రజలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వైద్యం కోసం వచ్చేవారు. గ్రామీణ స్థాయిలోకి ప్రైవేట్ ఆస్పత్రులు రావడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. దీనికి తోడుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులు మారడం, విధులు నిర్వహించాల్సిన వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు ఈ దవాఖానాకు రావడానికి ఆసక్తి చూపడం లేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 8 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఇద్దరు డాక్టర్లతో పాటుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 33 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 22 పోస్టులు ఖాళీగా ఉండగా, 11 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. 11 మందిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎలాంటి సమాచారం లేకుండా విధులకు రావడం లేదు, ల్యాబ్ టెక్నీషియన్ కొండాపూర్‌లోని డయాగ్నోస్టిక్ సెంటర్‌కు డిప్యూటేషన్‌పైన, ఇద్దరు సబార్డినేటర్లలలో ఒక్కరు పదోన్నతిపైన, మరొకరు వారంలో మూడురోజులు మాత్రమే వస్తారు. మిగిలిన 11 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

అనాధికారికంగా వైద్యురాలు దుమ్మా..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లుగా డాక్టర్ నిఖిత, డాక్టర్ అనాం నజాంలను ప్రభుత్వం నియమించింది. గత సంవత్సరం ఆగస్టు 15 నుంచి డాక్టర్ అనాం నజాం ఉన్నతాధికారులకు, మండల వైద్యాధికారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అనాధికారికంగా విధులకు దుమ్మా కొడుతోంది. అలాగే మండలంలో ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్‌పైన వెళ్లడంతో రోగులకు టెస్టులు అత్యవసమైతే ప్రైవేట్‌ను సంప్రదించడమో లేక వారంలో ఒక్కసారి వచ్చే ల్యాబ్ టెక్నీషియన్ కోసం నిరీక్షించాల్సిందే.

సిబ్బందిని నియమించాలి



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సరైన సేవలను అందించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి. డాక్టర్ అందుబాటులో ఉండి రోగులను పరీక్షించి అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచి అందించాలి.

– నరేందర్‌రెడ్డి, సంతాపూర్

ఉన్నతాధికారులకు నివేదించాం



మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అనాం నజాం గత సంవత్సరం ఆగస్టు నుంచి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు రావడం లేదు. అలాగే ఆస్పత్రిలో సిబ్బంది కొరత కూడా ఉంది. ఈ విషయాలపై జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చాం.

– డాక్టర్ నిఖిత, మండల వైద్యాధికారి

డాక్టర్లు	మంజూరైన పోస్టులు	ఉన్న సిబ్బంది
అసిస్టెంట్ డాక్టర్లు	02	01
అప్తాలిమిక్ అధికారి	01	01
ఎంపీహెచ్‌ఈఓ	02	02
ఏపీఎంఓ	01	-
సీనియర్ అసిస్టెంట్	01	01
పీఎంఓ	01	01
స్టాఫ్ నర్సు	01	01
ఎంపీహెచ్‌ఎస్ (పురుషులు)	02	-
ఎంపీహెచ్‌ఎస్ (మహిళ)	01	01
హెల్త్ అసిస్టెంట్ (మహిళ)	08	01
హెల్త్ అసిస్టెంట్లు (పురుషులు)	07	-
ఫార్మసిస్టు	01	01
ల్యాబ్ టెక్నీషియన్	01	-
కంప్యూటర్ ఆపరేటర్	01	01
లైట్ వెహికల్ డ్రైవర్	01	-
సబార్డినేటర్	02	-

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం మహల్ ఎలికట్ట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్నారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. నిరుపేదలు తృప్తిగా భోజనం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేసినందుకుగాను గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భవానీ మాత సాక్షిగా చెబుతున్నా దబ్బులు ముట్టలేదు

తాను ఏ పరిశ్రమల యజమానుల నుంచి డబ్బులు తీసుకునే వ్యక్తిని కానని, అంబాభవానీ మాత సాక్షిగా చెబుతున్నా ఎలికట్ట పరిధిలో ఉన్న పరిశ్రమల వద్ద పైసా ముట్టలేదన్నారు. గత పాలకులు పరిశ్రమల నుంచి డబ్బులు తీసుకొని ఇక్కడి పరిశ్రమలు కాలుష్యం వెదజల్లుతున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కావలి శ్రీశైలం, బుద్ధ నర్సింహ, రాజు, గున్న శర్వలింగం, మల్లయ్యయాదవ్, ఆర్ల యాదయ్య, చంద్రయ్య, వెంకట్రామిరెడ్డి, నర్సింహ, శివ, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

నందిగామ: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో గ్రామానికి చెందిన కిందిబావి యాదయ్య ఇంట్లో సోమవారం ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు అర్హులైన లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేదల సంక్షేమమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీఖాన్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్, కృష్ణ, బుచ్చయ్య, సీతారాం, ప్రభాకర్, రవి, ప్రతాప్, సురేశ్, వెంకటేశ్‌గౌడ్, యాదయ్య, తేజగౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ మహాసభకు తరలిరండి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా హన్మకొండలో నిర్వహించే రజతోత్సవ మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొత్తూరు, కేశంపేట, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాలు, మున్సిపాలిటీల పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కనీవిని ఎరుగని రీతిలో పార్టీ అధిష్టానం మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షలాది మందితో ఈ నెల 27న హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను నిర్వహిస్తున్నటు లక్షలాది మంది హాజరయ్యే ఈ సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామ గ్రామం నుంచి భారీఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండూటి నరేందర్, నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఎంఎస్ నట్‌రాజన్, వెంకట్‌రెడ్డి, చీపిరి రవి యాదవ్, దేవేందర్‌యాదవ్, లక్ష్మీనారాయణ, మురళీధర్‌రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

బీజేవైఎం జిల్లా నాయకుడు కరుణాకర్‌రెడ్డి

చేవెళ్ల: పట్టణంలో ఈ నెల 12న నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్రను హిందువులందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా నాయకుడు కరుణాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని గుండాల గ్రామంలో సోమవారం వీరహనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త నిష్ఠతో ధర్మకోసం పనిచేయాలని, హిందూ సంఘటితం కోసం నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్రలో పెద్దసంఖ్యలో హిందువులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పేద, ధనిక, నిమ్న, అగ్రవర్ణాలు అనే భేదం లేకుండా హిందువులంతా సంఘటితమై నిలబడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శ్రీశైలం, తిరుపతిరెడ్డి, బల్వంత్‌రెడ్డి, కుమార్, లింగం తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు ఉన్నత పదవులు పొందినప్పుడే సంతోషాన్ని పొందుతారని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. సోమవారం కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి వెంకటయ్య పదవీ విరమణ పొందడంతో అదే పాఠశాలలో పనిచేస్తున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు హమీద్‌కు ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కనకమామిడి పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు రాంచందర్, పీఆర్టీయూ మండల బాధ్యులు బందయ్య, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న వీధి నాటకం

షాబాద్: స్వాధ్యాయి పరివార్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని ముద్దెంగూడ, బొబ్బిలిగామ, మాచన్‌పల్లి తదితర గ్రామాల్లో శ్రీరాముడి చిత్రపటంతో, ఆటా పాటలతో యువతీ, యువకులు, మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. సీతాదేవికి స్వయం వరం నాటికను చిన్నారులు కళ్లకు కట్టినట్లు వేసి చూపించారు. కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న యాదవరెడ్డి

భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి

షాబాద్: పంటలు పొట్టకొచ్చి గింజబట్టే సమయంలో రైతులకు విద్యుత్ అవసరాన్ని ఆసరా చేసుకొని సమస్యలు పరిష్కరించకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు విద్యుత్ అవసరాన్ని ఆసరా చేసుకున్న అధికారులు డబ్బులకు ఆశపడి సకాలంలో సమస్య పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సమస్య పరిష్కరించడి సారు అంటూ రైతులు అధికారుల కాళ్ల మొక్కిన వారు కనికరించడం లేదన్నారు. మండల పరిధిలోని బోనగిరిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 47లో విద్యుత్ స్తంభం విరిగిపోయి విద్యుత్ సరఫరా ఐదురోజులుగా నిలిచిపోయినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదన్నారు. రైతులు ఈ విషయమై విద్యుత్ అధికారులకు తెలిపినా వారు పోలీసులకు ఫిర్యాదు చేసినా చేయమని, మీ పని త్వరగా కావాలంటే రూ.15 వేల రూపాయలు చెల్లిస్తే ప్రైవేట్ వ్యక్తులతో త్వరగా చేయిస్తామని లైన్ ఇన్‌స్పెక్టర్ చెప్పడం రైతులను ఇబ్బందికి గురిచేయడమేనన్నారు. అక్రమాలకు పాల్పడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, సభ్యులు వెంకట్‌రెడ్డి, చంద్రబాబు, నర్సింలుగౌడ్, ఆంజనేయులు, కృష్ణ తదితరులు ఉన్నారు.

వృత్తి నైపుణ్యాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చేవెళ్ల: గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వెల్‌స్పన్ ఫౌండేషన్, ఏఐఎస్ఈసీటీల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్‌స్పన్ గ్రూప్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్‌కుమార్ తెలిపారు. చేవెళ్లలో సోమవారం ఉచిత శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్హత కలిగి ఉండి 18 సంవత్సరాలపై బడిన నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్యాల శిక్షణ తరగతులకు అర్హులని చెప్పారు. ప్రధానంగా డిమాండ్ ఉన్న డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్లంబర్ జనరల్, మిషన్ టైలింగ్ అనే నాలుగు కోర్సులలో యువతకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ప్రతినిధి సురేఖ, సునందాదేవి, విశాల్‌శర్మ, రవీంద్ర, ఉపేందర్, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న నాయకుడు సత్యనారాయణ

బీఆర్ఎస్ నేత సత్యనారాయణ

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాజకీయ నాయకులు, వ్యాపారులు, పరిశ్రమల నిర్వాహకులు తమవంతు సహకారం అందించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మె సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం ఆయన తన సొంత ఖర్చులతో ఫర్నిచర్, ఇతర సామగ్రి అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని సాధించేందుకు ఉపాధ్యాయుల సాయంతో నిరంతరం కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని వివరించారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమయ్యే రీతిలో బోధించాలని కోరారు. చదువుల్లో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్యయాదవ్, నర్సింహారెడ్డి, మాణిక్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, చెన్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బడిబాట వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, గ్రామస్తులు

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం వాల్‌పోస్టర్లు, కరపత్రాన్ని గ్రామపెద్దలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని గ్రామస్తులకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తుందన్నారు. తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. దీనిపై స్పందించిన గ్రామస్తులు గ్రామంలోకి వచ్చే ప్రైవేట్ స్కూల్ బస్సులను బహిష్కరించి, వచ్చే జూన్‌లో కనీసం 40 నుంచి 50 మంది విద్యార్థులను తమ పాఠశాలలో చదివే విధంగా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తామని తెలిపారు. ఆకృతి స్వచ్ఛంద సంస్థ పాఠశాలకు ల్యాప్ ట్యాప్ విరాళంగా అందజేశారు. వారికి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వర్షిత, ఎస్ఎంసీ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య, గ్రామస్తులు బలరాం, సతీశ్, శ్రీనివాస్, రుక్మద్దీన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ స్తంభం సరిచేయరూ..



ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని చూపుతున్న కాలనీవాసులు

షాద్‌నగర్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఉన్న ఇనుప స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. గతంలో కాలనీలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, ప్రతిరోజు ఈ రోడ్డు మీదుగా కాలనీవాసులతో పాటుగా పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు వెళ్తుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన ఇనుప విద్యుత్ స్తంభాన్ని మార్చి సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.